తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
31 ఆగస్టు 2026

# రైతు బీమా పై రెన్యువల్ లొల్లి సందిగ్ధంలో అన్నదాత




**గద్వాల, ఆగస్టు 30(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బీమా పథకం గడువు ఆగస్టు 13తో ముగిసినా, ఈ ఏడాదికి సంబంధించిన రెన్యువల్ ప్రక్రియను అధికారులు ఇంకా చేపట్టకపోవడంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని కౌలు, సన్నకారు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో సుమారు 91 వేల మంది, రబీలో 60 వేల మందికి పైగా రైతులు వివిధ పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, గడువు ముగిసిందనే నెపంతో ఇటీవల అకాల మరణం పొందిన రైతుల వివరాల నమోదును, క్లెయిమ్ దరఖాస్తులను స్వీకరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నిరాకరిస్తుండటంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.సాధారణంగా ప్రతి ఏటా బీమా గడువు ముగియడానికి ముందే ప్రభుత్వం ఎల్ఐసీ (LIC) సంస్థకు ప్రీమియం చెల్లించి పథకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. కానీ, ఈసారి ఆగస్టు 13 దాటి రెండు వారాలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో అసలు ఈ పథకం కొనసాగుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది. గతంలో కుటుంబ పెద్దను కోల్పోయిన రైతు కుటుంబాలకు ఈ రూ. 5 లక్షల బీమా పరిహారం కొండంత అండగా నిలిచేది. ప్రస్తుత తరుణంలో ఒకవేళ రైతు మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి ఏమిటనే ప్రశ్న బాధిత వర్గాలను వేధిస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 42 లక్షల మందికి పైగా రైతులు ఈ పథకం పరిధిలో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ప్రీమియం నిధులు విడుదల చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన యువ రైతులు కూడా ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకోవడానికి ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, తక్షణమే రైతు బీమా ప్రీమియం నిధులను విడుదల చేసి, మరణించిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని, రెన్యువల్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని జిల్లా రైతాంగం మరియు రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.




# సోమవారం ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 30(జనంసాక్షి);**



జిల్లాలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనలో భగంగా జిల్లా అధికారులు మంత్రి పర్యటన ఏర్పాట్లతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ -2026 నోటీసుల జారీ ప్రక్రియకు సంబంధించిన విధుల్లో నిమగ్నమై ఉన్నందున సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ముందస్తు సమాచారాన్ని గమనించి సోమవారం ప్రజావాణి కోసం జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందుగానే ఈ సమాచారాన్ని తెలియజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.




# తినే తిండి కల్తీ.. కొనే వస్తువులు కల్తీ!

- **పాలు నుంచి పప్పుల వరకు.. ఏది స్వచ్ఛమో చెప్పలేని దుస్థితి**
- **కాసుల కోసం ప్రజల ఆరోగ్యంతో చెలగాటం.. నామమాత్రపు తనిఖీలతో అక్రమార్కులకు అడ్డూ అదుపూ కరువు**

**కోహిర్, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఉదయం లేవగానే తాగే టీ నుంచి రాత్రి తినే భోజనం వరకు.. మనం తీసుకునే ప్రతి ఆహార పదార్థం నాణ్యమైనదేనా? అనే అనుమానం ప్రజలను వెంటాడుతోంది. బయటకు మెరిసిపోతున్న సరుకులు.. లోపల నాణ్యత మాత్రం ప్రశ్నార్థకంగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులు అడ్డదారుల్లో అధిక లాభాలు ఆర్జించేందుకు నాసిరకం పదార్థాలు వినియోగిస్తున్నారనే విమర్శలు వెల్లువెతున్నాయి.

పాలు, పప్పులు, వంటనూనెలు, మసాలా దినుసులు, స్వీట్లు, పండ్లు, కూరగాయలు, బేకరీ ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్.. ఇలా తినే ప్రతి వస్తువులోనూ కల్తీ భయం నెలకొంది. ధర తక్కువగా ఉండాలి.. లాభం ఎక్కువగా రావాలి అన్న వ్యాపార ధోరణి చివరకు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కల్తీకి కాసులే కొలమానం!**

అధిక లాభాల కోసం నాసిరకం ముడిపదార్థాలు, నాణ్యత లేని నూనెలు, కృత్రిమ రంగులు, గడువు ముగిసిన పదార్థాలను వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా పండుగలు, శుభకార్యాల సమయంలో స్వీట్లు, పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరగడంతో కొందరు అక్రమార్కులు ఇదే అదనుగా కల్తీకి పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కల్తీ దందాలో లాభం వ్యాపారిదైతే.. నష్టం మాత్రం సామాన్యుడిదే! అన్న భావన ప్రజల్లో బలపడుతోంది. వ్యాపారి జేబు నిండుతుంటే.. వినియోగదారుడి ఆరోగ్యం ఖాళీ అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మెరిసే పండ్లు.. మసాలా రంగులు.. అనుమానాలే!**

మార్కెట్‌లో ఆకర్షణీయంగా కనిపించే పండ్లు, కూరగాయలు, మసాలా దినుసులు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. అయితే వాటి నాణ్యత, నిల్వ విధానం, వినియోగించిన పదార్థాలపై సాధారణ ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం సమస్యగా మారింది.

అదేవిధంగా ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో తయారీ తేదీ, గడువు తేదీ, బ్యాచ్ నంబర్, పదార్థాల వివరాలను పరిశీలించకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని నిపుణులు సూచిస్తున్నారు.

**తనిఖీలు కాగితాలకే పరిమితమా?**

కల్తీని అరికట్టాల్సిన అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించాల్సిన అవసరం ఉంది. కానీ కొన్ని సందర్భాల్లో తనిఖీలు నిర్వహించి నమూనాలు తీసుకున్న తర్వాత వాటి పరీక్షా ఫలితాలు ఏమయ్యాయో ప్రజలకు తెలియకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

కల్తీపై ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా.. మార్కెట్లు, హోటళ్లు, స్వీట్ షాపులు, బేకరీలు, కిరాణా దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై నిరంతర నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

కల్తీ ఆహారం ప్రభావం ప్రతి ఒక్కరిపైనా పడే అవకాశం ఉన్నప్పటికీ చిన్నారులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిపై ప్రభావం మరింత తీవ్రంగా ఉండే ప్రమాదం ఉంది. పాఠశాలలు, హాస్టళ్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, స్వీట్ షాపుల్లో విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.



**ప్రత్యేక డ్రైవ్‌కు డిమాండ్**

కోహిర్ ప్రాంతంలో ఆహార భద్రతా అధికారులు ప్రత్యేక తనిఖీల డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పాలు, వంటనూనెలు, పప్పులు, మసాలా దినుసులు, స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్ తదితరాల నమూనాలను సేకరించి ప్రయోగశాలల్లో పరీక్షించాలని కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. కల్తీ రుజువైతే కేసులు నమోదు చేసి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజలకు సమాచారం ఇస్తేనే నమ్మకం**

అధికారులు స్వాధీనం చేసుకున్న కల్తీ పదార్థాలు, సేకరించిన నమూనాలు, వాటి పరీక్షా ఫలితాలు, నమోదైన కేసులు, తీసుకున్న చర్యలను బహిరంగంగా వెల్లడిస్తే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ దందాకు ఇప్పటికైనా చెక్ పడుతుందా? లేక తనిఖీల పేరుతో తూతూమంత్రంగా వ్యవహారం కొనసాగుతుందా? అనేది వేచి చూడాల్సిందే. అధికారులు ఇప్పటికైనా మేల్కొని కఠిన చర్యలు తీసుకోకపోతే కల్తీ ప్రభావం ఒక్క కుటుంబానికే పరిమితం కాకుండా.. మొత్తం సమాజ ఆరోగ్యానికే పెనుముప్పుగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సాయినగర్ కాలనీ రహదారి సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం

- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు దృష్టికి సమస్య..
- సంబంధిత అధికారులతో మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు సమన్వయం





**మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 30 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలో సాయినగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు అతి త్వరలో శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడతామని మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కానుగు రాధిక భూపతి రాజు హామీ ఇచ్చారు.

సాయినగర్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని నేషనల్ హైవే–ఆర్ అండ్ బీ అధికారులు బ్లాక్ చేయడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు, వెంటనే స్పందించారు.

ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సమస్యను యంగ్ డైనమిక్ లీడర్ డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం లభించేలా కృషిచేస్తామని తెలిపారు.

ప్రజల సమస్య ఏదైనా వెంటనే స్పందించడం.. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం.. సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరంతరం కృషి చేయడం.. ఇదే మెదక్ మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, ప్రజాసేవకు నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు.

ప్రజల సమస్యనే తన సమస్యగా భావిస్తూ, మెదక్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, సాయినగర్ కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా సంబంధిత నేషనల్ హైవే, ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి, సాయినగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. రహదారిని యథావిధిగా పునరుద్ధరించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ, ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పాదయాత్రను విజయవంతం చేయాలి

- వెల్దుర్తి మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు రంగీ కృష్ణ



**వెల్దుర్తి, ఆగస్టు 30 (జనంసాక్షి):** పోతుల బొగుడ నుండి వెల్దుర్తి మీదిగా మెదక్ రోడ్ వరకు డబుల్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని వెల్దుర్తి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రంగి కృష్ణ అన్నారు. ఆదివారం వెల్దుర్తిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఈ పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని పార్టీలకతీతంగా ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు ముఖ్యంగా వెల్దుర్తి నుండి మెదక్ రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైందని గత కొన్ని సంవత్సరాల నుండి అధికారులకు నాయకులకు విన్నవించుకున్న పట్టించుకున్న నాథుడు లేరని వారన్నారు ఈ రోడ్డు పనుల గురించి బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న కృషిని అభినందించేది పోయి కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందని రంగి కృష్ణ అన్నారు రోడ్డు పనుల గురించి అడ్డుపడడం వారి రాజకీయ విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోదండ కృష్ణ గౌడ్ పంచ భూపాల్ రెడ్డి అశోక్ గౌడ్ కమ్మరి శ్రావణ్ అశోక్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

# మల్కాపూర్‌లో 461వ స్వచ్ఛభారత్





**తూప్రాన్, ఆగస్టు 30(జనంసాక్షి):** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 416వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో చేపట్టారు. పిచ్చి మొక్కలను, ప్లాస్టిక్ ను తొలగించారు. అలాగే గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన చావిడికి మరమ్మతులు చేశారు. పరిశుభ్రతను పాటిస్తూ నిరంతరం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, పిట్ల వేణు, మన్నె తిరుపతి, రేఖ నాగరాజు గౌడ్, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# బిజ్వారంలో సంతను ప్రారంభించిన సర్పంచ్



**మల్దకల్, ఆగస్టు30(జనంసాక్షి):** మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో 36 ఏళ్ల క్రితం కనుమరుగైన కూరగాయల సంతను మళ్ళీ గ్రామ సర్పంచ్ వై.శైలజ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పునఃప్రారంభించారు.గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో సంతను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ వై. శైలజ మాట్లాడుతూ 1990 సంవత్సరంలో బిజ్వారం గ్రామంలో కొనసాగిన కూరగాయల సంతను 36 సంవత్సరాల తర్వాత తిరిగి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గ్రామ ప్రజలకు కూరగాయలు అందుబాటులో ఉండటంతో పాటు రైతులు, వ్యాపారులకు కూడా ఈ సంత ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంతను కొనసాగిస్తూ, గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

పాత సంతను తిరిగి ప్రారంభించడంతో గ్రామ ప్రజలు, రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఉలిగేపల్లి, దాసరపల్లి, మేకలసోంపల్లి, జిల్లెడు బండ గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో సర్పంచులు జయరాముడు, నాగేష్, ఉపసర్పంచ్ కర్రెన్న, ఉపసర్పంచ్ శివ, మాజీ సర్పంచ్ భరత్‌రెడ్డి, నాయకులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపలో పాల్గొన్న.. సుంకిరెడ్డి



**వెల్దండ, ఆగస్టు 30(జనంసాక్షి):** వెల్దండ మండలం బర్కత్‌పల్లి గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై అమ్మవారి ప్రతిష్ఠాపన అనంతరం శ్రీ పెద్దమ్మ తల్లిని దర్శించుకుని పూజ కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ పెద్దమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించారు. అనంతరం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులతో గొప్ప స్థానాలకు చేరుకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పర్వతాలు,ఉప సర్పంచ్ నరసింహ, సీనియర్ నాయకులు బొజ్జయ్య, అల్లాజీ, కొండల్, లింగం, మల్లేష్, శ్రీశైలం,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రాజు, జంగయ్య, కొండల్ యాదవ్, చంద్రశేఖర్ ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువత,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాదయ్య మాతృమూర్తి

# మృతికి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంతాపం





**జడ్చర్ల, ఆగస్టు 30 (జనంసాక్షి):** బాలానగర్ మండలం నందారం గ్రామానికి చెందిన అరేళ్ళ యాదయ్య మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న జడ్చర్ల నియోజకవర్గ శాసన సభ్యులు డా.జనంపల్లి అనిరుధ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

శనివారం హైదరాబాద్ నుండి నేరుగా నందారం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, యాదయ్య స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ కన్నతల్లిని కోల్పోవడం అనేది జీవితంలో తీరని లోటని, ఆ బాధ వర్ణనాతీతమని అన్నారు. ఈ కష్ట కాలంలో యాదయ్య కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో రేణుక ఎల్లమ్మ పూజలు



**అమీన్పూర్, ఆగస్టు 30 (జనంసాక్షి):** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని పటేల్ గూడా గ్రామంలో ఆదివారం శ్రావణమాస బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, స్థానిక కాలనీల ప్రజలు ఆలయంలో పూజలు నిర్వహించారు. భాజపా మండల పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజు కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐకమత్యంతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

# మఖ్తల్ మండల మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నిక



**మక్తల్, ఆగస్టు 30 (జనంసాక్షి):** మక్తల్ మండల మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునెప్ప ముఖ్య అతిథిగా హాజరుకాగా, నారాయణపేట జిల్లా కమిటీ నాయకుల ఆధ్వర్యం, పర్యవేక్షణలో ఈ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ.. సమాజ సంక్షేమానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి నూతన కమిటీ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. మఖ్తల్ మండల అధ్యక్షులు సంజీవ్, ఉపాధ్యక్షులు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి గణేష్,

ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సిములు, సహాయ కార్యదర్శి నరేష్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన మండల కమిటీ నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు, భారత రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. పేద ప్రజల విద్య, వైద్యం మరియు ఇతర మౌలిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడతామని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీను, ఉపాధ్యక్షులు పాలెం వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బి.కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి చంద్రశేఖర్, కోశాధికారి రాము, కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్, వై. కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా సాయిగణేష్ షాపింగ్ మాల్ వార్షికోత్సవ వేడుకలు



**సదాశివపేట, ఆగస్టు 30(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని సాయి గణేష్ షాపింగ్ మాల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం మాల్ ఆవరణలో లక్కీ డ్రా విజేతలను ప్రకటించి, విజేతలకు స్కూటీలను అందజేశారు. వినియోగదారుల ఆదరణతో వార్షికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు యాజమాన్యం తెలిపింది. లక్కీ డ్రాకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమంలో మాల్ యాజమాన్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా: ఇద్దరు యువకుల అరెస్ట్

- **430 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, 03 మొబైల్ ఫోన్లు స్వాధీనం**

**జగదేవ్‌పూర్, ఆగస్టు 30 (జనంసాక్షి):** గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఇరువురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన ఆదివారం ఉదయం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో చోటుచేసుకుంది.




స్థానిక ఎస్ఐ జి.కృష్ణారెడ్డి కథనం ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఉదయం 7 గంటల సమయంలో స్థానిక భారత్ పెట్రోల్ పంపు వద్ద మాటువేసి ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా రహదారిపై గజ్వేల్ వైపు వెళుతున్న ఇరువురు యువకులను గుర్తించారు. దీంతో సదరు యువకులు పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు అప్రమత్తమై అదుపులోకి తీసుకున్నారు.

ఈ క్రమంలో నిందితులను విచారించగా జగదేవ్ పూర్ మండల పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన దేవుని అలియాస్ కొజ్జా నవీన్ కుమార్(25), జగదేవ్ పూర్ గ్రామానికి చెందిన చీలసాగర్ పవన్ కళ్యాణ్(26) అనే ఇరువురు నిందితులు గత కొంతకాలంగా ఒడిశా రాష్ట్రంలోని సీలేరు సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమంగా రవాణా చేసుకొని కొంత వారు తాగడంతో పాటు విక్రయానికి పాల్పడుతున్నట్టు వెల్లడయింది. ఈ సందర్భంగా నిందితుల నుంచి 430 గ్రాముల గంజాయి, టీఎస్ 06 ఎఫ్ ఎఫ్ 3588 నంబరు గల జిక్సర్ వాహనం, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై ఎన్ డిపిఎస్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి వివరించారు.

**సమాచారం ఇవ్వండి...**

గంజాయిని సేవించడం, అక్రమంగా కలిగి ఉండటం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ కృష్ణారెడ్డి అన్నారు. గంజాయి సేవించిన లేదా గంజాయి అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడిన అలాంటి వ్యక్తుల వివరాలు ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

# మేనిఫెస్టో ప్రకారం సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరించాలి

**మెదక్, ఆగస్ట్ 30 (జనంసాక్షి):** మెదక్ జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు సెప్టెంబర్ 1వ తేదీన తలపెట్టిన ధర్నాకు హాజరై మహాధర్నాను విజయవంతం చేయండి. పీఆర్టీయూ మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆశనిపాతముగా మారిన సిపిస్‌ను రద్దుచేసి ఓపిఎస్ విధానమును వెంటనే పునరుద్ధరించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానమును వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సీ ప్రకటించాలని అనే ముఖ్యమైన 3 డిమాండ్‌లతో సెప్టెంబర్ ఒకటవ తేదీన హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్క్ వద్ద పిఆర్టియు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాకు మెదక్ జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు తరలిరావాలని పీఆర్‌టీయూ మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు.

**ఆదివారం రోజు మెదక్ జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ..** కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధరిస్తామని చెప్పిన ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న సిపిఎస్‌ను రద్దుచేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని వారు అన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసే వరకు పిఆర్టియు పోరాటం చేస్తుందని 1)సిపిఎస్‌ను రద్దు చేయాలని, 2)పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, 3)డీఎస్సీ 2003. ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోని డిఎస్సి 2003 ఉపాధ్యాయులకు కూడా పాత పెన్షన్ విధానంను అమలు చేయాలనే అజెండాతో సెప్టెంబర్ ఒకటవ తేదీన తలపెట్టిన మహా ధర్నాకు ఉపాధ్యాయులు



నీలి రంగు చొక్కలు లేదా టీ షర్ట్స్ మహిళా ఉపాధ్యాయులు నీలి రంగు సారీస్ ధరించి రేపటి మాహాధర్నాకు జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వనికి కనువిప్పు కలిగే విధంగా మహాధర్నా ఉండాలని వారు ఒక ప్రకటనలో ఉపాధ్యాయ సోదరులను కోరారు. ఈ కార్యక్రమములో మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి, జిల్లా బాధ్యులు సంగమేశ్వర్, నందరామ్ రఘుబాబు, సుభాష్ రెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు

- **సంప్రదాయబద్ధంగా బోనం, తొట్టెల సమర్పణ**



**రామచంద్రాపురం, ఆగస్టు 30(జనంసాక్షి):** శ్రావణమాస బోనాల పండుగ సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ మందుముల శ్రీనివాస్‌నగర్ కాలనీలోని శ్రీ ఐదుగుళ్ల పోచమ్మతల్లి ఆలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిఏటా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ కుటుంబసభ్యులతో కలిసి తమ ఇంటి నుంచి బోనం, తొట్టెలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## ఎరువుల బుకింగ్ యాప్‌తో రైతులకు తిప్పలు

- **ఓటీపీ, సర్వే నంబర్ ఎంట్రీలో ఇబ్బందులు**

**రేవల్లి, ఆగస్టు 30 (జనంసాక్షి):**

ఫ్రేంవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యాప్‌లో బుకింగ్ చేసుకునే సమయంలో ఓటీపీ రాకపోవడం, సర్వే నంబర్ ఎంట్రీ చేయడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ బిజీగా ఉండటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

దీంతో ఎరువుల కోసం వ్యవసాయ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, వెంటనే అధికారులు స్పందించి యాప్ లోని సాంకేతిక లోపాలను సరిచేసి రైతులకు సులభతరంగా ఎరువులు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

**యాప్ బుకింగ్ విధానం రద్దు చేసి భూ విస్తీర్ణం ఆధారంగా ఎరువులు సరఫరా చేయాలి: ఉమ్మనమోని ఆంజనేయులు, రైతు తల్పునూర్ గ్రామం**



ఎరువుల కోసం ప్రస్తుతం అమలు చేస్తున్న ఫ్రేంవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ యాప్ బుకింగ్ విధానం రైతులకు భారంగా మారింది. ఓటీపీ రాకపోవడం, సర్వే నంబర్ నమోదులో ఇబ్బందులు, సర్వర్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో ఎక్కువగా చదువురాని రైతులు ఉన్నారు. వారికి ఓటీపీలు చెప్పడం, సర్వే నెంబర్లు నమోదు చేయడం లాంటివి రాదు.

దీంతో ప్రభుత్వం యాప్ ద్వారా కాకుండా, రైతుల సర్వే నంబర్లు, భూ విస్తీర్ణాన్ని బట్టి, పట్టాదారు పాసు పుస్తకం చూసి నేరుగా ప్రభుత్వమే ఎరువులు సరఫరా చేసే విధానాన్ని అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రతి రైతు పట్టాదారు పాస్ పుస్తకంలో ఉన్న భూ విస్తీర్ణం ప్రకారం ఎంత ఎరువు అవసరమో లెక్కించి, సహకార సంఘాలు, రైతు వేదికల ద్వారా నేరుగా పంపిణీ చేస్తే దళారుల బెడద, యాప్ చిక్కులు తప్పుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానంపై దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- **ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ. చంద్రశేఖర్**



**కోహీర్, ఆగస్టు 30 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్, పైడిగుమ్మల్ లాల్సింగ్ తండా గ్రామాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారుల కుటుంబాలను అభినందించారు. ఈ సందర్భంగా ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లన్న పాటిల్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్ మహేష్ కుమార్, సర్పంచులు లయ్యేక్, సురేష్, రాజ్ కుమార్, విష్ణు, మాజీ ఎంపీటీసీ జ్ఞానరత్నం, ఉప సర్పంచ్ ఆశమ్మ, వార్డు సభ్యులు శానం కాంతమ్మ, బాలయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం



**వెల్దండ, ఆగస్టు 30 (జనంసాక్షి):** వెల్దండ మండలం పరిధిలోని బర్కత్ పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్దన్న మండల మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి పోతేపల్లి సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సి.ఐ.టి.యు. రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ రాజు ఎన్నిక



**అమరచింత, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఆదివారం తెలంగాణ బీడీ & సిగార్ వర్కర్స్ యూనియన్ (CITU) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు సిద్దిపేట లోని ఆదివారం నాడు జరిగిన ఈ మహాసభలో రాష్ట్ర సహాయకార్యదర్శి యస్. రాజు ఎన్నిక అయ్యారు. ఆయన ఎన్నిక పట్ల ప్రజా సంఘాలు హర్షం ప్రకటించారు. అమరచింత కు చెందిన రాజు రాష్ట్ర సహాయకార్యదర్శి గా ఎన్నిక కావడం గర్వ కారణం అని కొనియాడారు. వ్యకస జిల్లా అధ్యక్షులు యస్. అజయ్. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్ ఎన్ రమేష్ లు హర్షం వ్యక్తం చేశారు.

## మెదక్ జిల్లా బీజేపీ మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా ఖిచ్చి గ్యన్ సింగ్ నియామకం



మెదక్ టౌన్, ఆగస్టు 30(జనంసాక్షి): మెదక్ బీజేపీ పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు అధ్యక్షతన, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జాగ్ మోహన్ సింగ్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా ఖిచ్చి గ్యన్ సింగ్ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకం ఉంచి మైనారిటీ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి ఖిచ్చి గ్యన్‌సింగ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ మోర్చా రాష్ట్ర ఇన్‌చార్జ్ జయశ్రీ, ఎంపీ డీకే అరుణ, మైనారిటీ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి..

నార్సింగి, ఆగస్టు 30 (జనంసాక్షి): నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44 కాస్లాపూర్ యూ టర్న్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ బీమరి సృజన తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు.

మృతుడు నీలం, ఆకుపచ్చ రంగు టీషర్ట్, లేత ఆకు పచ్చ రంగు కార్గో జీన్స్ ప్యాంట్, నల్లరంగు బెల్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి చేతికి కడియం, కుడి చేతి ఉంగరపు వేలికి రింగ్, మణికట్టు కు రాఖీ, నల్లటి దిష్టి పూసల దండ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు, ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్ లేదా ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన సాక్షులు, ఘటనకు సంబంధించిన సమాచారం ఉన్నవారు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్ కు 8712657895, 8712657938 నంబర్ల కు సమాచారం అందించాలని నార్సింగి ఎస్ఐ బీమరి సృజన కోరారు.

## ఐక్యత ఫౌండేషన్ సౌజన్యంతో స్వచ్ఛ ధార

- స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే లక్ష్యం సంకిరెడ్డి



వెల్దండ, ఆగస్టు 30 (జనంసాక్షి): వెల్దండ మండలంలోని అల్లంతోట బావి తండా గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ వారి సౌజన్యంతో స్వచ్ఛ ధార కార్యక్రమం ద్వారా త్రాగునీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రపరిచి ప్రజలకు అందుబాటులో ఉంచారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో గ్రామాల్లోని తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో పరిశుభ్రపరుస్తూ,ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రతను నెలకొల్పడం ద్వారా తాగునీటి నాణ్యతను మెరుగుపరిచే చర్యలు చేపట్టడం జరిగింది.సుంకిరెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలకు సర్పంచ్ రోజా అరుణ్ నాయక్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.ఈ రోజు కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ విజయ్ కుమార్ ,మరియు వార్డు సభ్యులు జాంకు, పుల్సింగ్,గ్రామ నాయకులు శంకర్, సుదీర్, లక్ష్మణ్,రమేష్, రాంలాల్, లాల్య, తార్య,తదితరులు పాల్గొనడం జరిగింది.

## రోడ్డు పాలవుతున్న తాగునీరు... పట్టించుకోని గద్వాల మున్సిపాలిటీ!



గద్వాల, ఆగస్టు 30(జనంసాక్షి): గద్వాల పట్టణంలోని దౌదర్పల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై పైప్‌లైన్ లీకై తాగునీరు రోడ్డుపాలవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నీటి సరఫరా జరిగే సమయంలో పెద్దఎత్తున నీరు వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి వృథాను అరికట్టేందుకు కుళాయిలకు తక్షణమే ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి లీకేజీలను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేశారు.దీనికి తోడు, పట్టణంలోని పలు అంతర్గత రహదారుల్లో సైతం పైప్‌లైన్లు దెబ్బతిని మురుగునీరు, తాగునీరు కలిసిపోయే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా సరిగ్గా అందక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇక్కడ ఇలా నిరంతరం నీరు వృథా కావడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి స్పందించకపోతే మున్సిపల్ కార్యాలయం ముట్టడికి వెనుకాడబోమని హెచ్చరించారు.

## మెదక్‌లో ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు






మెదక్ టౌన్, ఆగస్టు 30 (జనంసాక్షి): మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలు జానపద కళారూపాల ప్రదర్శనలతో కన్నుల పండుగగా సాగాయి. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రభుత్వ సలహాదారు కేవీ రవిచారాచారి, ఐఏఎస్, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు వంగా శ్రీనివాస్ గౌడ్, జనరల్ సెక్రటరీ సుంచు లింగన్న ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మెదక్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి టీఎన్జీవో భవనం వరకు సుమారు 250 మంది జానపద కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చిరతల భజన, కోలాటం, ఒగ్గు డోలు, పోతరాజుల విన్యాసాలు తదితర సంప్రదాయ జానపద కళారూపాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం టీఎన్జీవో భవనంలో వివిధ జానపద కళారూపాల ప్రదర్శనలు నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనలు ఆహూతులను అలరించడంతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

జిల్లా జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు గుడాల సత్యనారాయణ మాట్లాడుతూ, మన ప్రాచీన జానపద కళలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అంతరించిపోతున్న సంప్రదాయ కళారూపాలను భావితరాలకు పరిచయం చేసి, వాటి పరిరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంచు లింగన్న, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మేకల నారాయణ, తదితరులు కళాకారులు యాదమ్మ, శేఖర్ చారి, కృష్ణ, నేరుడి సాయిలు, బిక్షపతి, సుమలత, శ్రీశాంత్, నవీన్, మురళి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట నియోజకవర్గ ప్రజలపై ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలి

**రాంపూర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.25,000 విరాళం అందజేత: వంగ రాజేశ్వర్ రెడ్డి**



సిద్దిపేట, ఆగస్టు 30 (జనంసాక్షి): సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి సహిత విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ. 25,000/- (ఇరువై ఐదు వేల రూపాయలు) విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీ ఆంజనేయ స్వామివారి దివ్య ఆశీస్సులతో సిద్దిపేట నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు. ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడూరు మమతా రాజు, ఉపసర్పంచ్ అల్లం సాయి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఘనంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు

**జీపీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**





గుమ్మడిదల,ఆగస్టు 30 (జనంసాక్షి): గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను సీకేజీ యువసేన సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జీపీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులను గోవర్ధన్ రెడ్డి పరిచయం చేసుకుని, యువతకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని ఆయన అన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కుమార్ గౌడ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని గోవర్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, నాయకులు వెంకట్రామరెడ్డి, దేవేందర్ రెడ్డి, హుస్సేన్, తుపాకుల రాజు, మహేష్, శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మురళి, ఆంజనేయులు, కరుణాకర్ గౌడ్, దాసరి సాయి యాదవ్, నరేష్, సాయి, శ్రీనివాస్, రవి, సీకేజీ యువసేన సభ్యులు, క్రీడాకారులు, యువకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సారథి వంగ రవీందర్ రెడ్డికి అభినందన పూర్వక వీడ్కోలు



సిద్దిపేట, ఆగస్టు 30 (జనంసాక్షి): తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షులుగా రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన వంగ రవీందర్ రెడ్డి సోమవారం నాడు ఉద్యోగ విరమణ పొందనున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగులు,సంఘం నాయకులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు.సుదీర్ఘ కాలం పాటు రెవెన్యూ శాఖలో వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వర్తించిన రవీందర్ రెడ్డి, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండే వారని సహచర ఉద్యోగులు కొనియాడుతున్నారు. (టీఆర్ఈఎస్ఏ) అధ్యక్షుడిగా ఆయన రెవెన్యూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, వారి వృత్తిపరమైన ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు తోటి ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలిచారని నాయకులు గుర్తుచేసుకున్నారు.

సోమవారం జరగనున్న ఈ సమావేశంలో పలువురు రెవెన్యూ శాఖాధికారులు,సంఘం ప్రతినిధులు పాల్గొని రవీందర్ రెడ్డి సేవలను ప్రశంసించనున్నారు. ఆయన పదవీ విరమణానంతరం కూడా ప్రజా సంక్షేమ,సేవా కార్యక్రమాలలో నిమగ్నమై ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ ఉద్యోగ వర్గాలు ఘనంగా అభినందనలు తెలియజేస్తున్నాయి.



## మన్ కీ బాత్ వీక్షించిన బిజెపి సీనియర్ నేత నామాజీ

**నారాయణపేట ఆగస్టు 30(జనంసాక్షి):** ప్రతినెల ఆఖరి ఆదివారం ప్రధాని నరేంద్రమోడీ నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం హైదరాబాద్ బిజెపి కేంద్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యు లు నాగురావు నామాజీ వీక్షించారు. ఈ సందర్భంగా నాగురావు నామాజీ మాట్లాడుతూ ప్రతి నెల ఒక అంశంపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలతో మమేకమై చర్చించడం మార్గదర్శనం చేయడం విశేషమని అన్నా రు.దేశంలోనే కొత్తఒరవడి సృష్టించారని అన్నారు.

## మహిళా అదృశ్యం



**కేటీదొడ్డి, ఆగస్టు 30,(జనంసాక్షి):** కొండాపూర్ గ్రామానికి చెందిన పోతుల సుప్రియ (19) అనే యువతి అదృశ్యమైనట్లు కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... మృతుడు లేట్ నరసింహులు కుమార్తె సుప్రియ, ఈ నెల 28న పెద్దమ్మ కొడుకు (అన్న)కు రాఖీ కట్టేందుకు వెంకంపేట గ్రామానికి వెళ్లింది. ఆ రోజు అక్కడే ఉండి, మరుసటి రోజు (29.08.2026) సాయంత్రం 4:00 గంటల ప్రాంతంలో తన తల్లి పోతుల దేవమ్మకు ఫోన్ చేసి, కొండాపురం గ్రామం స్టేజ్ దగ్గర ఉన్నానని, ఇంటికి వస్తున్నానని తెలిపింది. సుప్రియను తీసుకురావడానికి ఆమె బాబాయి జనార్థన్ కొండాపురం స్టేజ్ వద్దకు వెళ్లగా, అక్కడ సుప్రియ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో, బాధితురాలి తల్లి దేవమ్మ పోలీసులను ఆశ్రయించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సుప్రియ సమాచారం తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు,

## రంగారెడ్డిగూడ గ్రామంలో అంగరంగ వైభవంగా కోట మైసమ్మ బోనాలు



**రాజాపూర్, ఆగస్టు 30(జనంసాక్షి):** రంగారెడ్డిగూడ గ్రామంలో ఆదివారం కోట మైసమ్మ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించిన గ్రామ పెద్దలు. యువకులు మైసమ్మ ఉత్సవ విగ్రహం ఊరేగింపుగా తీసి ఆటపాటలతో బోనాలు దేవాలయానికి బయలు దేరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, మాజీ సర్పంచ్ శశికళ రెడ్డి, దుష్యంత్ రెడ్డి, సంజీవ్, వినోద్ కుమార్, వెంకటేష్,పవన్, శివ ప్రసాద్, గుణాకర్, కిరణ్, లక్ష్మీ నారాయణ గౌడ్, శ్రీకాంత్, ఉప్పరి యాదయ్య, మహిళలు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలకు మఠం బిక్షపతి హాజరు



**పుల్కల్, ఆగస్టు30(జనంసాక్షి):** రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి పలు శుభకార్యాలకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.పుల్కల్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు అవుసలి లక్ష్మణ్ చారి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు. అనంతరం చౌటకూర్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వివాహానికి హాజరయ్యారు.

# అభివృద్ధి.. క్రీడలకు పెద్దపీట: ఎమ్మెల్యే కసిరెడ్డిరెడ్డి

- ఎన్‌హెచ్-167 ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల పరిశీలన
- చిరు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచన
- కల్వకుర్తిలో 2కే రన్ ప్రారంభించి విజేతలకు బహుమతుల అందజేత

**కల్వకుర్తి,ఆగస్టు 30,(జనంసాక్షి):** ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించడంతో పాటు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి-167 ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన అక్రమ కట్టడాలను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతీయ రహదారిపై ఎలాంటి అడ్డంకులు లేకుండా పాదచారులు, వాహనదారులకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించేలా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు అనవసర నష్టం,ఇబ్బందులు కలగకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. తొలగింపు చర్యలకు ముందుగా వారికి నోటీసులు జారీ చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేదా నిబంధనల మేరకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు తెలిపారు.

**బాలికల తొలి 2కే రన్ ప్రారంభించిన ఎమ్మెల్యే...**

అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి హైదరాబాద్ చౌరస్తాలో నిర్వహించిన బాలుర, బాలికల తొలి 2కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. చిన్నారులు, యువ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేసి అభినందించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహిస్తే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు,మున్సిపల్ అధికారులు,క్రీడా సంఘం నిర్వాహకులు, క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 8 మంది ఇందిరమ్మ గృహప్రవేశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**మల్లకల్, ఆగస్టు30(జనంసాక్షి):** మండల పరిధిలో మల్లెందొడ్డి గ్రామంలో ఆదివారం ఎనిమిది మంది లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు నూతన గృహ ప్రవేశలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. శారదమ్మ, పద్మమ్మ, మహేశ్వరి తెలుగు సుజాత, ఈశ్వరమ్మ, కుమ్మరి రాజేశ్వరి, ఏ రాజేశ్వరి కావడం జరిగినది. నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ...** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎంకి, మంత్రికి, ఎమ్మెల్యేకి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజారెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ వీరన్న,సర్పంచులు తూంకృష్ణరెడ్డి, వినోద్, శివారెడ్డి,వెంకటన్న,శేషాద్రి నాయుడు,వెంకటేశ్వర్ రెడ్డి నాయకులుపాల్గొన్నారు.

# కోయిల్ సాగర్ పంప్ హౌస్ నుండి అమరచింత పెద్ద చెరువు కు నీరు విడుదల చేయాలి



**అమరచింత, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఆదివారం నాడు కోయిల్ సాగర్ లిఫ్టు పంప్ హౌస్ నుండి ఉంద్యాల చెరువుల మీదుగా అమరచింత పెద్ద చెరువుకు, పరిసర కుంటలకు కోయిల్ సాగర్ నీరు విడుదల చేయాలని.అమరచింత రైతు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీ, ప్రజాసంఘాలు నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉంద్యాల శివారులోని కోయిల్ సార్ పంపు హౌస్‌ను రైతులు రైతు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర ప్రాంతాల సమీపంలో కృష్ణానది పారుతున్న రైతుల భూములకు మాత్రం సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉంద్యాల చెరువు మీదుగా అమరచింత పైన ఉన్న కాలువ ద్వారా అనాయి కుంట. నాగులకుంటలకు కోయిల్ సాగర్ నీరు రావడానికి అవకాశాలు ఉన్నాయని కనుక ప్రభుత్వం నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వ్యవసాయ పొలాలకు నీళ్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ రవి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నేత కె. లక్ష్మీనారాయణ, రైతులు కొండద రెడ్డి, పి.ఆంజనేయులు, పి.రాఘవేంద్ర, పి.రఘు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి కాంత్, మరియు రాజేశ్వర్ రెడ్డి, ఉప్పరి రంగన్న, చిన్న అంజి, చిన్నకురుమన్న, గద్దర్ శీను తదితరులు పాల్గొన్నారు.

## పాత దొమ్మట గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ ఎన్నిక



**చేర్యాల, ఆగస్టు 30(జనంసాక్షి):** చేర్యాల మండలంలోని పాత దొమ్మట కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం చేర్యాల మండల అధ్యక్షులు మంజే మల్లేశం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా గుజ్జుల రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులు దండబోయిన సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా మాచెర్ల కొండల్, అంగాల నర్సింలు, కార్యదర్శులుగా గుజ్జుల తిరుపతి రెడ్డి,దండబోయిన మల్లేశం, గాలిపల్లి వెంకట్ రామ్ రెడ్డి,గుజ్జుల శుశీల, కోశాధికారిగా శెట్టె మహిపాల్ గౌరవ సలహాదారులుగా గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, మాచెర్ల మోహన్ రెడ్డి, గంపల ఎల్లయ్య,మాచెర్ల యాదగిరి,అంగాల రవి,వంకాయల బాలయ్య, గుజ్జుల బాల్ రెడ్డి, ఎన్నికైన నాయకులు శుభాకాంక్షలు తెలిపి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

## మనకి బాత్ ద్వారా స్ఫూర్తిదాయక వ్యక్తులు వెలుగులోకి



**గద్వాల, ఆగస్టు 30 (జనంసాక్షి):** మన్ కీ బాత్ వీక్షించిన స్నిగ్ధారెడ్డిప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ 137వ ఎపిసోడ్ను ఆదివారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి వీక్షించారు. మన్ కీ బాత్ ద్వారా అనేక మంది స్ఫూర్తిదాయక వ్యక్తులు వెలుగులోకి వచ్చారని ఆమె అన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..** దేశంలోని మారుమూల ప్రాంతాల్లో సమాజం కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న ఎంతోమంది సామాన్యుల విశేషాలను ప్రధాని ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆమె కోరారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్రాములు, స్థానిక కార్యకర్తలు మరియు అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్ షాపుల ద్వారా సబ్సిడీకి నిత్యావసర వస్తువులు అందించాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు యస్.అజయ్ డిమాండ్

**అమరచింత, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అజయ్ మాట్లాడుతూ.. దేశంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ20 ఇథనల్‌కు దేశంలోని చెరుకును ఎక్కువగా వినియోగించడంతో దేశంలో చక్కెరకొరత తీవ్రంగా ఏర్పడి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. ఉల్లిగడ్డలు పప్పు నూనె కూరగాయల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోవడంతో ఏ వస్తువు కొనుక్కోవాలన్న ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని ధరలను అదుపు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత ఈ పరిస్థితుల్లో పేదలకు సబ్సిడీపై రేషన్ చౌక ధర దుకాణాల ద్వారా చక్కెర ఉల్లిగడ్డలు పప్పు పల్లీలు లాంటి 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని కోరారు. చక్కెర కొరత నివారించేందుకు విజిలెన్స్ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించాలని కోరారు. బ్లాక్‌లో అత్యధిక రేట్లకు విక్రయిస్తున్న వ్యాపారస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి కిరాణా షాప్‌లో ఎమ్మార్పీ రేట్ల పట్టికను ఉంచేలా




విజిలెన్స్ అధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి ప్రభుత్వాలు చేతులు దులుపుకోవడం సరికాదని దుయ్యబట్టారు. ఏ రోజు ఏ ధరలు పెరుగుతాయో తెలియని అయోమయ పరిస్థితిలో ప్రజలను ప్రభుత్వాలు గందరగోళానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతోవ్యవహరించి ధరలను అదుపు చేయడంతో పాటు సబ్సిడీతో రేషన్ షాప్ ల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆర్ఎన్ నాగరాజు చిన్న విష్ణు భగవంతు. తిరుమల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లను ప్రారంబించిన ఎంపీ అరుణ



**నారాయణపేట, ఆగస్టు 30(జనంసాక్షి):** నారాయణపేట మున్సిపాలిటీలోని 8వ వార్డు సత్యసాయి కాలనీలో ఆదివారం సీసీ రోడ్లను పాలమూరు ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి ,జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామ య్య,మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల జీ ఆర్ రెడ్డి,కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బి.కృష్ణ, గోపాల్ యాదవ్, సీనియర్ నాయకులు ఉదయ భాను, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పదర వాసి ఎడ్మ శ్రీను యాదవ్‌కు ఉత్తమ కోచ్ అవార్డు

- ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలి: ఎడ్మ శ్రీను యాదవ్

**అచ్చంపేట, ఆగస్టు 30 (జనంసాక్షి):** నియోజకవర్గ పరిధిలోని పదర మండల కేంద్రానికి చెందిన జాతీయ స్థాయి క్రీడాకారుడు, మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎడ్మ శ్రీను యాదవ్ అథ్లెటిక్స్ రంగానికి అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ 2026 ఉత్తమ కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని మీర్‌పేట్ బచ్పన్ ప్లే స్కూల్‌లో తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు ఉత్తమ కోచ్ అవార్డును అందజేశారు.




ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యాశాఖ సభ్యుడు చారగొండ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎడ్మ శ్రీను యాదవ్ మాట్లాడుతూ, అథ్లెటిక్స్ రంగంలో తాను అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, జీవితాంతం అథ్లెటిక్స్ అభివృద్ధికి సేవ చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి అవార్డుకు ఎంపిక చేసిన బజరంగ్ స్పోర్ట్స్ అకాడమీ, రామ్ లక్ష్మణ్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులకు, అలాగే తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, యువత క్రీడల్లో మరింతగా రాణించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఎడ్మ శ్రీను యాదవ్‌కు ఉత్తమ కోచ్ అవార్డు రావడం పట్ల గ్రామస్తులు, సీనియర్ క్రీడాకారులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వనమహోత్సవం




**నారాయణపేట, ఆగస్టు 30(జనంసాక్షి):** లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320 ఎ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్, నారా యణపేటలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం కోసం మొక్కలు ఎంతో ముఖ్యమైనవి. మన చుట్టూ పచ్చదనం పెరిగి నప్పుడే మనకు ఆరోగ్యక రమైన ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుంద న్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రవికుమార్ గౌడ్ ఆధ్వ ర్యంలోనిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మల్టిపుల్ కౌన్సిల్ మెంబర్ హరినారాయణ, కార్యదర్శి లయన్ మోహన్ కుమార్ కోన,సభ్యులు శ్రీనివాస్ లాహోటి, కృష్ణ మూర్తి,జనార్దన్, కర్లీ బాల కృష్ణ,బాలాజీ కాంప్లే, బాలాజీ ఎగ్‌బోట్, వెంకటయ్య, హిమాన్షు సింగ్, సదానందం చారి, సురేందర్ చారి బి.సాయినాథ్,శాంత, ఎస్. చక్రవర్తి, విద్యార్థిని విద్యార్థులు కూడా పాల్గొని మొక్కలు నాటారు.

# విద్యుత్ సమస్యకు పరిష్కారం

**తూప్రాన్ ఆగస్టు 30(జనంసాక్షి):** పర్కిబండ పంచాయతి మధిర గ్రామం తుపాకులపల్లిలో 10 కేవీ ట్రాన్స్ ఫార్మర్ పాడవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.విషయాన్ని తెలుసుకున్న పర్కిబండ సర్పంచ్ ఠాకూర్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్ విద్యుత్ శాఖ ఏఈ రాజ్ కుమార్ కి విజ్ఞప్తి మేరకు 15 కేవి నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఆదివారం సర్పంచ్ మోతిబాయి ఆధ్వర్యంలో ట్రాన్స్ పార్మర్ ఏర్పాటు చేశారు. నూతన ట్రాన్స్ పార్మర్ ఏర్పాటుతో ప్రజల సమస్య పరిష్కారం అయింది. గ్రామంలో విద్యుత్ ఓవర్ లోడ్ దృష్టిలో ఉంచుకుని అదనపు ట్రాన్స్ పార్మర్ ఏర్పాటు చేయాలని ఏఈ కి విజ్ఞప్తి మేరకు త్వరలో ఏర్పాటు ఏఈ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిమ్మల మహేష్,పాలకవర్గం సభ్యులు, నాయకులు నిమ్మల మల్లేష్ యాదవ్, కొమురెల్లి యువత మరియు గ్రామ ప్రజలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి: ఎస్సై పోచయ్య

**రేగోడ్, ఆగస్టు30 (జనంసాక్షి):** చిన్నపిల్లలను చదువుకునే విద్యార్థులను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని మెదక్ జిల్లా రేగోడు ఎస్ఐ పోచయ్య సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చిన్న పిల్లలు చదువుకునే విద్యార్థులు విద్యార్థినిలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మొబైల్ ఫోన్లు చూస్తూ చదువుకు దూరంగా ఉంటారని చిన్నపిల్లలకు కూడా తమ గృహాల్లో తల్లిదండ్రులు మొబైల్ ఫోన్లు ఇస్తూ ఆటపాటలు చేస్తున్నారని ఫోన్ వెలుతురుతో కంటి చూపు తగ్గే అవకాశం ఉందని మొబైల్ ఫోన్ చూస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోను చేసి మాట్లాడుతూ మీ నాన్న తెలుసని ఫోను చేస్తే స్పందించి ఓటీపీలు చెప్పి మోసపోతున్నారని ఇంస్టాగ్రామ్ లో కూడా గుర్తు తెలియని వ్యక్తులకు నమ్మి మోసపోతున్నారని ఈ విషయాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతున్నారా లేదా అన్న విషయం మర్చిపోకుండా తప్పకుండా చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉందని ఎస్ఐ పోచయ్య తెలిపారు.




# సెప్టెంబర్ 3న 'హలో మాదిగ - చలో సిద్దిపేట' మహా బైక్ ర్యాలీ

- ఎమ్మార్పీఎస్ అధికారిక ప్రతినిధి దేవులపల్లి రాజేందర్



**నంగునూరు, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఎస్సీ సంక్షేమ నిధులు మరియు దళితుల హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 3న సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు 'మహా బైక్ ర్యాలీ' నిర్వహించనున్నట్లు తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ పిలుపునిచ్చారు. నంగునూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమానికి కేటాయించిన నిధులను పక్కదారి పట్టించకుండా ఎస్సీలకే పూర్తిస్థాయిలో అందించాలి. రూ. 12 లక్షల సహాయం: చేవెళ్ల డిక్లరేషన్ మరియు అభయహస్తం హామీ ప్రకారం ప్రతి దళిత కుటుంబానికి రూ. 12 లక్షల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలి. పారిశుద్ధ్య కార్మికులు పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుతూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుద్ధ్య/సఫాయి కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ. 25,000 జీతం చెల్లించాలి.

# విశ్వశాంతి కోసం మహా పాదయాత్ర

- పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

**సంగారెడ్డి, ఆగస్టు 30 (జనంసాక్షి):** విశ్వశాంతి కోసం ఆదివారం 19వ మహా పాదయాత్ర నిర్వహించారు. జిల్లాలోని పటాన్ చెరువు శ్రీ ఉమామహేశ్వర నుండి బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వరకు భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ , ధనసిరి వీరేష్ స్వామి అప్ప, వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నరసింహులు, గంధిగే రాజు, అమ్మిశెట్టి జయప్రకాష్ , రాజేశ్వర్ స్వామి, నాగేశ్వర్ పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రంజోల్ గ్రామంలోని శ్రీ రాచన్న స్వామి నూతన ఆలయంలో శ్రీ రాచన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే మునిపల్లి మండలంలోని కంకోల్ , మగ్దుంపల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం, శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో ఇప్పపల్లి నరసింహులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జహీరాబాద్ తాలూకా అధ్యక్షులు ఆగూర్ శివరాజ్,



కార్యదర్శి బండి శ్రీనివాస్, అందోల్ తాలూకా అధ్యక్షులు పట్లోళ్ల అశోక్, జిల్లా యువజన జాయింట్ సెక్రెటరీ పోలీస్ ప్రవీణ్ కుమార్, సంగారెడ్డితాలూకా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల శివకుమార్, సదాశివపేట మండల అధ్యక్షులు పట్లోళ్ల నాగేశ్వర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల అరుణ, సంతోష, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు



**రాజాపూర్, ఆగస్టు 30 (జనంసాక్షి):** రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డి గూడ గ్రామ శివారులో జాతీయ రహదారి-44 పక్కన ఈ నెల 19న గుర్తుతెలియని మహిళను గొంతుకోసి హత్య చేసిన ఘటనను పోలీసులు ఛేదించారు. మృతురాలిని వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లి తండాకు చెందిన జాటవత్ లాలిగా గుర్తించారు. బాలానగర్‌లోని ఆమె అద్దె ఇంట్లో లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పరిశీలనలో ఓ ట్రాన్స్‌పోర్ట్ కంటైనర్‌ను గుర్తించి, దాని ఆధారంగా లారీ డ్రైవర్ చోటే ఖాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.

పోలీసుల వివరాల ప్రకారం.. లాలితో చోటే ఖాన్ రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. భార్య మృతి చెందడంతో లాలిని పెళ్లి చేసుకోవాలని భావించి ఆమెకు తరచూ డబ్బులు పంపేవాడు. ఘటన జరిగిన రోజు షాద్‌నగర్ నుంచి ఫోన్ చేయగా బాలానగర్‌లో కలుద్దామని లాలి తెలిపింది. అక్కడ ఆమె మరో వ్యక్తితో కనిపించడంతో చోటే ఖాన్ ఆగ్రహానికి గురయ్యాడు. లాలిని లారీలో ఎక్కించుకుని వెళ్తుండగా మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడటంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న చోటే ఖాన్ కూరగాయల కత్తితో లాలి గొంతు కోసి హత్య చేసి, మృతదేహాన్ని రహదారి పక్కన పడేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. డీఎస్పీ వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసులను ఎస్పీ జానకి అభినందించారని తెలిపారు.

## కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్‌లోకి 50 మంది



**పెద్దకొత్తపల్లి, ఆగస్టు 30 (జనంసాక్షి):** పెద్దకొత్తపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. మారెడ్ మన్‌దిన్నె, వేదుకరావుపల్లి తండాకు చెందిన తాజా మాజీ ఎంపీటీసీ మంగమ్మ అమ్రు నాయక్, ఉప సర్పంచ్ గన్నోజు రామ్మోహన్, యువ నాయకులు లక్ష్మణ్ నాయక్, పాండు నాయక్‌లతో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వారికి గులాబీ కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు ఇప్పుడు వాస్తవాలను గుర్తిస్తున్నారని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ నాయకత్వం అవసరమని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. పోడు భూములకు పట్టాలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలతో పేదలకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన ఎస్పీ వినీత్

- **ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి ఎస్పీ**



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 30(జనంసాక్షి):** హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుండి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించి న 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ పాల్గొని మారథాన్‌ను విజయవం తంగా పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిం చిన ఈ హాఫ్ మారథాన్‌లో పలువురు ఐఏఎస్, ఐపీ ఎస్ అధికారులు, యువత, క్రీడాకారులు, ఫిట్‌నెస్ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఉత్సాహంగా పాల్గొని 21 కిలోమీటర్ల పరుగును పూర్తి చేశారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది శారీరకంగా, మాన సికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమని భావి స్తున్న ఎస్పీ, నారాయణ పేట జిల్లాలో కూడా పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందు లో భాగంగా జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బందికి లాంగ్ రన్నింగ్, సైక్లింగ్ తదితర ఫిట్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడు తూపోలీసు విధుల్లో శారీ రక దృఢత్వం, మానసిక ఆరోగ్యం ఎంతో కీలకం అన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయం వ్యాయా మం, రన్నింగ్, సైక్లింగ్, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన కార్యక లాపాలకు కేటాయించా లన్నారు ఫిట్‌నెస్ అనేది కేవలం పోలీసులకు మాత్ర మే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలన్నారు.

నారాయణపేట జిల్లా ప్రజలు, యువత, విద్యార్థు లు పోలీస్ శాఖ నిర్వహిస్తు న్న ఫిట్‌నెస్ కార్యక్రమాల ను ఆదర్శంగా తీసుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించా లన్నారు. ప్రతిరోజూ రన్నింగ్ లేదా వాకింగ్ చేయడం, యోగా, ధ్యానం వంటి వాటిని అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటే నే మన రోజువారీ పనుల ను మరింత ఉత్సాహంతో, సమర్థవంతంగా నిర్వహిం చగలుగుతానన్నారు. యువత క్రీడల వైపు, ఫిట్‌నెస్ వైపు దృష్టి సారించాలనీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. ప్రతి ఒక్కరూ ఆరో గ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ సమాజానికి ఆద ర్శంగా నిలవాలి" అని ఎస్పీ తెలిపారు. 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను పూర్తి చేయడం ద్వారా ఫిట్‌నెస్‌పై తనకున్న నిబద్ధతను జిల్లా ఎస్పీ మరోసారి చాటి చెప్పారు. పోలీస్ అధికా రులు, సిబ్బందితో పాటు జిల్లా యువత, విద్యార్థు లకు కూడా ఇది స్ఫూర్తిదా యకంగా నిలవాలన్నారు.

## కేజీబీవీలో విద్యార్థుల భద్రత గాలికి!



**మహమ్మదాబాద్, ఆగస్టు 30 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలంలోని కంచింపల్లి గ్రామ పరిధిలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థుల భద్రత పై నిర్లక్ష్య ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీలు కట్టుకునేందుకు కొందరు విద్యార్థినులు కేజీబీవీ ప్రహరీ గోడ దూకేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ ఘటనను సిబ్బంది పట్టించుకోలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**ఉదయం డుమ్మా.. మధ్యాహ్నం హాజరు?**

ఆదివారం ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సిన మ్యాస్ టీచర్ నాగరాణి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థుల భద్రతను పర్య వేక్షించాల్సిన సమయంలో ఆమె అందుబాటులో లేకపోవడం ప్రశ్నార్థ కంగా మారింది. తాను అందుబాటులో లేనందున విద్యార్థుల బాధ్యత లను మరో సిబ్బందికి అప్పగించానని, అయితే వారు కూడా విధుల్లో లేకపోవడంతో భద్రత పర్యవేక్షణపై అనుమానాలు వ్యక్తమవు తున్నాయి.

విధులకు గైర్హాజరుపై ముందస్తు సమాచారం, అనుమతి ఇవ్వలేదని కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్ఓ విజయవాణి తెలిపారు. వాట్సాప్ గ్రూపు లోనూ ఎలాంటి సమాచారం లేదన్నారు.

ఇదిలా ఉండగా, తమ పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేయడం కూడా వివాదాస్పదమైంది. విద్యా ర్థుల భద్రతపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన సిబ్బంది తమపైనే మండిపడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు.

విద్యార్థుల భద్రత, సిబ్బంది హాజరు, ఆదివారం విధులు, భోజన నిర్వహణపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారి విజయకుమారిని వివరణ కోరేందుకు ప్రయత్నిం చగా స్పందించలేదు.

# అమ్మా మైసమ్మ తల్లి.. చల్లంగా చూడు మమ్మల్ని

- **వైభవంగా బంగారు మైసమ్మ బోనాల వేడుక**
- **అమ్మవారికి నైవేద్యాలు సమర్పించిన భక్తులు**
- **ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్**



**జడ్చర్ల, ఆగస్టు 30 (జనంసాక్షి):** అమ్మా శ్రీ బంగారు మైసమ్మ తల్లి.. చల్లంగా చూడు మమ్మల్ని, నీ కరుణా కటాక్షములు ప్రసా దించి కాపాడు తల్లి అంటూ కావేరమ్మపేట, జడ్చర్ల భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో 9వ వార్డులో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ ఉత్సవాన్ని ఆదివారం వైభ వంగా నిర్వహించారు. ఈ మేరకు పట్టణ మహిళలు బోనాలతో ఊరేగింపుగా దేవాల యానికి చేరుకొని ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మహిళలు నైవేద్యాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నా యి. భక్తులు అమ్మవారికి పొట్టేళ్లు, నాటు కోళ్లను సమర్పించి భక్తిని చాటు కున్నారు. బోనాల ఉత్సవంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా ఆయురారో గ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, మన సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం





అభినందనీయమని, నియోజకవర్గ అభివృద్ధికి అమ్మవారి దయ ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. బోనాల వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడుతూ అమ్మవారు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని





ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుక్క వెంకటేశం, నాయకులు అనిల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంశీకృష్ణ చారి, మాలిక్ షాకిర్, చటమోని రమేష్, గుండు చంద్రమౌళి, జగదీష్ చారి, మాజీ కౌన్సిలర్లు చైతన్య చౌహన్, కుమ్మరి రాజు ప్రశాంత్ రెడ్డి, మహేష్, నాయకులు పిట్టల మురళి, కరాటే శ్రీను, శ్రీకాంత్, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.